క్లుప్తంగా

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సంబేపల్లె : మండలంలోని అడవికమ్మపల్లెలో వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కుర్నూతల క్రాస్ వద్ద ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలను అర్చకులు నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించి పూలతో స్వామివారిని అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బడిమేల్ నరసింహులు, నాగేంద్ర బాబు, వీరయ్య, భక్తులు పాల్గొన్నారు.

వీరగంగమ్మకు..

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సాలాబాద్ గ్రామ సమీపంలోని వీరగంగమ్మ ఆలయ సప్తమ వార్షిక మహోత్సవం సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో మహా నివేదన, దశవిధ హారతులు, తీర్థ ప్రసాద వితరణ చేశారు. దాతల సహకారంతో ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం చేశారు. వీరగంగమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాల సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆలయ కమిటీ వారిచే బండలాగుడు పోటీలు జరుపనున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం వద్ద విద్యార్థులు, క్రీడాకారుల, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎండలు అధికమవ్వడంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఏప్రిల్‌లో ఎండలు మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని, అందువల్ల దాతల సహకారంతో మజ్జిగను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు రిటైర్డ్ హెచ్‌ఎం సుబ్బరాయుడు, ఆరవేటి చంద్రశేఖర్‌రాజు, చల్లా సుధాకర్‌బాబు, కోటేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రాయచోటి టౌన్ : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుటుంబానికి రాయచోటి జిన్నా సేవా సంస్థ శనివారం ఆర్థికసాయం చేసింది. రాయచోటి పట్టణంలోని సుబ్బారెడ్డి వీధిలో నివాసం ఉండే ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఓ మహిళ కిడ్నీ జబ్బుతో బాధపడుతూ సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొంటోంది. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నదన్న సమాచారం అందుకున్న సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్ రూ.10 వేలు నగదును అందించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానన్నారు.

మద్యం షాపులు బంద్

రాయచోటి టౌన్ : మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా మద్యం షాపులు మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ జిల్లా ఉన్నతాధికారి శ్రీధర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి సోమవారం సాయంత్రం 4 గంటల వరకు మద్యం షాపులు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామం వద్ద శనివారం 692 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తులసీ నాగ ప్రసాద్ తెలిపారు. మూలపల్లె గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామని ఆయన పేర్కొన్నారు. 692 బస్తాల రేషన్ బియ్యం, తరలిస్తున్న జీపు స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేశామని చెప్పారు. బియ్యంను తహసీల్దారుకు అప్పగిస్తామని వివరించారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి



చిన్నమండెం : మండల పరిధి చిన్నర్సుపల్లెలో కుక్కల దాడిలో 13 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన వేపూరి మంగమ్మ గొర్రెలను మేపుకొంటూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి గొర్రెలను తమ ఇంటి ఆవరణలోని దొడ్డిలోకి వదిలింది. కుక్కలు ఈ మంద పైకి వెళ్లి 13 గొర్రెలను గొంతు కొరికి చంపేశాయి. దీంతో రూ.80 వేల నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరింది.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- గృహసారథుల సమావేశంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు
- పెనగలూరు, చిట్వేలి తాగునీటి పనులకు 2023–24 బడ్జెట్‌లో నిధులు



గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పెనగలూరులో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకుడు పులి సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ 2019 ఎన్నికలలో ఆడపడుచుల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారని, తిరిగి మరొక్కసారి ఆయన్ను దీవించాలని ఆయన మహిళలను కోరారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజులకే డ్వాక్రా రుణాలు రద్దు చేశారన్నారు. ఇచ్చిన హామీలుకంటే అత్యధిక పథకాలు అమలుపరిచిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సోమశిల బ్యాక్ వాటర్ నుంచి పెనగలూరు, చిట్వేలి మండలాలకు తాగునీటి కోసం రూ. 250 కోట్లను ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారని, ఈ బడ్జెట్‌లోని నిధులను పొందుపరుస్తారని వారు తెలిపారు. నాడు- నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కల్పించిన నేత జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని చూడాలంటే బూతద్దం తెచ్చుకోవాలన్నారు. అంతకుముందు అజయ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. పార్టీలకు అతీతంగా మధ్యవర్తులు లేకుండా బటన్ నొక్కి ఖాతాలలో జమ చేశారన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు పులి సునీల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలు చేస్తున్న సేవలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. సామాన్య కార్యకర్తగా పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఒక్కొక్క పదవి ఇచ్చి ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ చైర్మన్‌గా చేసి ఆయన ఘతను చాటుకున్నారన్నారు. ముఖ్యంగా గృహసారథులకు ప్రమాదబీమా, జీవిత బీమా కల్పించి వారికి ఎన్నో మంచి గుర్తింపు తెచ్చేందుకు ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉదయగిరి సుబ్బరాయుడు, మండల పార్టీ కన్వీనర్ చక్రపాణి, గుండ్లూరు ఈశ్వరయ్య, సర్పంచ్ దేపూరు చిన్న వెంగల్‌రెడ్డి, సాతుపల్లి సుబ్బారెడ్డి, గుడ్ల వీరనారాయణ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి, కాకతీయ వెంకటేశ్వరరెడ్డి, గుండ్లూరు శివకుమార్, ఏటూరు సురేష్ రెడ్డి, ముద్రపల్లి, కట్టావారిపల్లి సర్పంచ్‌లు శివయ్య నాయుడు, గుండ్లూరు వెంకటేష్, సానారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నరసింహులు



నందలూరు(రాజంపేట) : నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దాసరి నరసింహులు ఎన్నికయ్యారు. నందలూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఓ.వి. కృష్ణారెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నిక ప్రక్రియలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నరసింహులు నాలుగవసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా షేక్ మహమ్మద్ అలీ కార్యదర్శిగా గొబ్బిళ్ల సుబ్బరామయ్య, సంయుక్త కార్యదర్శిగా నాయనపల్లె అనుదీప్, కోశాధికారిగా వినయ్, గ్రంథాలయ కార్యదర్శిగా మాడపూరి నళిని, సాంస్కృతిక కార్యదర్శిగా హస్తవరం ఆనంద్‌కుమార్, క్రీడా కార్యదర్శిగా సయ్యద్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలో సీనియర్ న్యాయవాదులు డి.మల్లికార్జున, మేఘనాదం, పసుపులేటి శంకర్‌లు పాల్గొన్నారు.

నూతన కోర్టు నిర్మాణానికి కృషి: నరసింహులు

నందలూరు కోర్టు నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందుగా తనను ఎన్నుకున్నందుకు బార్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనవంతుగా బార్ అసోసియేషన్ పురోభివృద్ధికి తోడ్పడతానన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లె : మండలంలోని దేవపట్లమిట్ట సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీకళ శనివారం తెలిపారు. 2022– 23 సంవత్సరంలో 4 వతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐదవ తరగతి ప్రవేశానికి, 2023 పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థినులు ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నివాళి

సిద్దవటం : మూలపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు బండి యల్లారెడ్డి(68) క్యాన్సర్ వ్యాధితో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మదుసూదన్‌రెడ్డిలు శనివారం ఉదయం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే మృతుని కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లిచాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉంటా

రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : నియోజకవర్గంలోని క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో అబూసిద్దిఖ్ ట్రావెల్స్ వారి ఆర్థిక సౌజన్యంతో వైఎస్ఆర్‌సీపీ నేత బేపారి మహమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పలువురు ముందుకు వస్తుండడం అభినందనీయమన్నారు. క్రీడాకారుల గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, బేపారి మహమ్మద్‌ఖాన్‌లు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చొరవతో జిల్లా కేంద్రానికి సమీపంలో సుమారు 20 ఎకరాలలో రూ.50కోట్ల నిధులతో క్రికెట్ స్టేడియాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడలకు జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మైనార్టీలు రంజాన్, బక్రీద్ పండుగలకు ప్రార్థనల చేసే ఈద్గా వద్ద చేపడుతున్న అభివృద్ధిలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిల కృషి మరువలేనిదంటూ చెప్పారు.

వజూఖానా పనుల పరిశీలన

అనంతరం ఈద్గా మైదానంలో జరుగుతున్న వజూఖానా నిర్మాణం పనులను ఆయన వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలసి పరిశీలించారు. రంజాన్ పర్వదినంలోపు వజూఖానా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలంటూ ఈద్గా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్‌ఖాన్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు ఆసిఫ్‌అలీఖాన్, ఈశ్వర్, ఫయాజ్ అహమ్మద్, సుగవాసి శ్యామ్, పల్లా రమేష్, జానం రవీంద్రయాదవ్, అన్నాసలీం, గువ్వల బుజ్జిబాబు, రియాజుర్ రహిమాన్, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు



పెనగలూరు: పోలింగ్ బూత్‌లను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ శ్రీధర్ రావు

పెనగలూరు : సోమవారం జరిగే గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మోడల్ స్కూల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీధర్ రావు తెలిపారు. శనివారం సాయంత్రం మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసిన వసతులపై తమ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బారికేడ్‌లు, పోలింగ్ సిబ్బంది కూర్చునేందుకు ఏర్పాట్లను పూర్తి చేసి రూములను కేటాయించామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు

సిద్దవటం : పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని తహసీల్దారు శంకర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహసీల్దారు మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను మండల వ్యాప్తంగా సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. మండలవ్యాప్తంగా పట్టభద్రుల ఓట్లు 940 ఉండగా వారికి పోలింగ్ కేంద్రం నెంబర్ 85, అలాగే ఉపాధ్యాయుల ఓట్లు 51 కాగా వీరికి పోలింగ్ కేంద్రం నెంబర్ 37లో ఓటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఓటు హక్కు వినియోగంచుకునేందుకు ఓటరు స్లిప్‌తో పాటు ఎన్నికల అధికారి సూచించిన ఏదైన ఒక ఫొటో ఐడీ కార్డులను వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

రామాపురం : ఏప్రిల్ 3 నుంచి జరగబోయే 10వ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షామీర్ బాషా అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొండావాండ్లపల్లెలో శనివారం 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో తమ పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల పలు సూచనలు, సలహాలు అందించారు. మొబైల్ ఫోన్‌కు, టీవీకి దూరంగా ఉండాలని పరీక్షల సమయంలో పిల్లలకు పనులు చెప్పకూడదని, ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మజ్జిగ, నిమ్మరసం వంటి పానీయాలు ఎక్కువ అందించాలన్నారు.

ప్రారంభమైన దిగువగొట్టివీడు పాలేటమ్మ జాతర



అలంకరణలో దిగువగొట్టివీడు పాలేటమ్మ

చిన్నమండెం : పాలేటమ్మ తల్లి ప్రజలందరినీ చల్లంగా చూడుతల్లీ అంటూ దిగువగొట్టివీడు గ్రామస్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారి జాతర వైభవోపేతంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. అదే విధంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆసాది వారు గంగమ్మ ఆగము చెప్పడంతో అమ్మవారి తిరునాల ప్రారంభమైంది.

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు

రాయచోటి అర్బన్ : కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయులు బలపరుస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు సాంబశివ, అబ్బవరం రామాంజులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగులు బలపరుస్తున్న కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

గోవుకు అంత్యక్రియలు

రాజంపేట : పట్టణంలోని రాజంపేట–తిరుపతి రహదారిలోని వజ్రం కల్యాణ మండపం ఎదుట శుక్రవారం ఓ గోవు అనారోగ్యంతో నరకయాతన అనుభవించిన సంఘటన పలువురిని కలిచివేసింది. గోవు దుస్థితిని తెలుసుకున్న గోమాత సంరక్షణ సేవాసమితి ప్రతినిధులు వర్థిబోయిన శ్రీధర్‌బాబు, తేజం రవిచంద్రప్రసాద్, ఏల్చూరి ప్రకాశ్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పశువైద్యశాలకు చెందిన బసవరాజు, సిబ్బందిని పిలిపించి చికిత్స అందించిన, ఫలితం లేకుండాపోయింది. శనివారం గోవు మృతిచెందడంతో గో సంరక్షణ సేవాసమితి శాస్త్రోక్తంగా గోమాతకు పూజలు చేసి, అంత్యక్రియలను నిర్వహించింది. కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం పునరావాసం కల్పించండి



సీపీఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న అగ్రహారం గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓబులవారిపల్లె : న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం మంగంపేట అగ్రహారం ఆర్‌ఆర్–2 గ్రామానికి పునరావాసం కల్పించాలని గ్రామస్తులు ఏపీఎండీసీ కార్యాలయంలో సీపీఓ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మంగంపేట అగ్రహారం గ్రామానికి గతంలో గ్రామాన్ని తరలించి ఎక్స్‌గ్రేషియా మాత్రమే ఇచ్చారని, ఆర్‌ఆర్ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని, ప్రస్తుతం న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం ఏపీఎండీసీ అధికారులు గ్రామస్తులకు మెరుగైన పునరావాసం కల్పించి, పరిహారం అందించాలన్నారు. ఆరు నెలలు లోపు గ్రామస్తులకు పరిహారంతోపాటు పునరావాసం కల్పించి గ్రామస్తులు కోరుకున్న ప్రదేశాలలో స్థలం కేటాయించి ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొలూరు నారాయణరెడ్డి, తల్లెం రమణారెడ్డి, రైల్వేకోడూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ వడ్డి సుబ్బారెడ్డి, పీ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, మైనార్టీ నాయకులు కరిముల్లా, సర్పంచ్ మినుగు సుధాకర్, ఎంపీటీసీ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కోసం ఎండీతో చర్చలకు రండి

మంగంపేట, కాపుపల్లి, దళితవాడ, అరుంధతివాడ మూడు గ్రామాల తరలింపు విషయంపై ఏపీఎండీసీ ఎండీ విజి వెంకటరెడ్డితో చర్చలకు రావాలని గ్రామస్తులను సీపీఓ వెంకటరమణ కోరారు. మూడు గ్రామాల పునరావాస కల్పనకు శనివారం ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు రెండో రోజు నిరసన చేపట్టారు. పునరావాస కల్పనలో జాప్యం జరుగుతోందని, రెవెన్యూ పరంగా అన్ని విధాలా సహకరించిన గ్రామాలకు పరిహారం, పునరావాసం కల్పించడంలో ఏపీఎండీసీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గ్రామస్తులు, పులపుత్తూరు రామసుబ్బారెడ్డి అన్నారు. ఇందుకు సీపీఓ మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలను ఎండీ వీజీ వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. గ్రామస్తులకు పెన్షన్లు, హెల్త్ కార్డులు వెంటనే అందజేసేందుకు ఆయన ఆదేశించారని పేర్కొన్నారు. ఉద్యోగాలు, పునరావాసం, పరిహారం విషయంపై బుధవారం గ్రామ ప్రతినిధులు, గ్రామస్తులు విజయవాడ ఏపీఎండీసీ కార్యాలయానికి వచ్చి చర్చించాలని, రెండు నెలల కాల వ్యవధిలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారన్నారు. ఇందుకు గ్రామస్తులు సమ్మతించి నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరయ్య, పులపుత్తూరు సుదర్శన్‌రెడ్డి, కోటి, మూడు గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార పర్వానికి తెర

- వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత వేయాలంటూ ఆ పార్టీ నేతల వినతి
- ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ సూచన



ఓబులవారిపల్లె: ప్రచారంలో సాయికిషోర్ రెడ్డి



సంబేపల్లె: విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో..



చిన్నమండెం: ప్రచారంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి

నందలూరు(రాజంపేట) : ఏ ఒక్క పట్టభద్రుని ఓటు పక్కకుపోకూడదని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలోని అరవపల్లెలోని మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం స్వగృహంలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రనాథ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత వేసేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతీయువకులకు చేసిన మేలును వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది పట్టభద్రులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించారన్నారు. ముఖ్యమంత్రికి తమ వంతుగా సాయం చేసే అవకాశాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో సద్వినియోగపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనారాయణ, జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, నడివీధి సుధాకర్, మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్, తుమ్మల భావనశ్రీధర్‌గౌడ్, ఎంపీటీసీలు సుభాన్, సోమిశెట్టి సునీతాప్రభాకర్, మైనార్టీ నాయకులు మున్వర్‌బాషా, మస్తాన్, అరిగెల నాని, బీసీ నాయకుడు హిమగిరి యాదవ్, ఆర్యవైశ్య సంఘం నాయకుడు చలపాటి నరసింహశెట్టి, దళిత నాయకులు కాకిచంద్ర, నాయపల్లె ఆదినారాయణతోపాటు నాగిరెడ్డిపల్లె అర్బన్ యువతీయువకులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి

చిన్నమండెం : వైఎస్ఆర్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి కోరారు. శనివారం చిన్నమండెంలో రవీంద్రారెడ్డికి మద్దతుగా దేవనాథరెడ్డి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటు రవీంద్రారెడ్డికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కురబల కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మండల ఉపాధ్యక్షుడు ఏజాస్ ఆలీఖాన్, ఎంపీటీసీలు రమేష్, వెంకటప్పనాయుడు, శ్యామ్, సర్పంచులు నజీర్‌బాషా, లక్ష్మీరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, అఫ్రోజ్, దామోదర్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు బుర్హాన్‌ఖాన్, అంజనప్ప, వెంకట్రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహామదు షరీఫ్, సాదిక్, శేఖర్, మురళీ, అన్వర్‌బాషా, ఏకా తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా శనివారం ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో ఆయా పంచాయతీలలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యాలయంలోని పట్టభద్రులు, ఉద్యోగులు, మైన్స్ తదితర ఉద్యోగులను కలిసి పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటువేసి వేయించి గెలిపించాలని కోరారు. ఓబులవారిపల్లె మండల కేంద్రంలో సర్పంచ్ ఎస్‌పీ జయపాల్‌రెడ్డి, బాలిరెడ్డిపల్లి గ్రామంలో గుంతకల్లు రైల్వే బోర్డు సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, యల్లాయపల్లె పంచాయతీలో సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి, చిన్నఓరంపాడు పంచాయతీలో మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామంలోని పట్టభద్రులను వారు కలిసి రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి, తల్లెం రమణారెడ్డి, పార్టీ సచివాలయాల కన్వీనర్ అమర్నాథరెడ్డి, పి.లక్ష్మినారాయణ, దేవ, వేణు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలిపించండి

సంబేపల్లె : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలించాలని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డిలు పట్టభద్రులను కోరారు. శనివారం దేవపట్లలోని పలు ప్రాంతాలల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నమూనా బ్యాలెట్ పత్రాన్ని చూపి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి గెలిపించాలని దేవనాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, నాయకులు తదితరలున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డిని గెలిపించండి

ఒంటిమిట్ట : ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కొండమాచుపల్లి సర్పంచు మేరువ శివనారాయణ కోరారు. శనివారం మండల పరిధిలోని కొండమాచుపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

సిద్దవటం : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్ఆర్‌సీపీ బలపరుస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధ్యానత ఓటును వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సిద్దవటం మండలంలోని పెద్దపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దిగువ దళితవాడ తదితర ప్రాంతాల్లో శనివారం వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలు అభ్యర్థించారు. సోమవారం రవీంద్రారెడ్డికి మద్దతుగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు పలు గ్రామాలలో పట్టభద్రులను కలిసి రవీంద్రారెడ్డిని ఓటు వేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, లక్కిరెడ్డిపల్లి వైస్ సర్పంచ్ రాజారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు నాగిరెడ్డి రమణ, ఎంపీటీసీలు లక్ష్మినారాయణ, జగన్‌మోహన్ రెడ్డి, శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు మొదట ప్రాధాన్యత ఓటువేసి వేయించి మంచి మెజార్టీతో గెలిపించాలని గాలివీడు ఎంపీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్ మొహిద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషణ్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు.



లక్కిరెడ్డిపల్లి: రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం



నందలూరు: మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి